క్లుప్తంగా

ఆరుగురు మద్యం విక్రయదారుల బైండోవర్

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో గతంలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహించి మద్యం విక్రయించినవారిని, ప్రస్తుతం మద్యం విక్రయిస్తున్న వారిని మద్దిపాడు పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి తహసీల్దార్ కోర్టులో ప్రవేశపెట్టారు. తహసీల్దార్ సుజన్‌కుమార్ ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయలకు బైండోవర్ చేశారు. ఇకపై మద్యం అమ్ముతూ వీరు దొరికితే వారికి రెండు లక్షల రూపాయల జరిమానా, జైలు ఉంటాయని హెచ్చరించారు.

9న సుస్వర సినీ సంగీత విభావరి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలిండియా కళారంగ సభ్యులు

ఒంగోలు మెట్రో: ఆలిండియా కళా రంగం, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5:30 గంటలకు స్థానిక కేశవస్వామిపేటలోని సీవీఎన్ రీడింగ్ రూమ్ కళావేదికపై నిర్వహించనున్నట్లు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ తెలిపారు. గానకోకిల, పద్మభూషణ్ పి.సుశీల జన్మదినోత్సవం కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుస్వర సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని పలువురు గాయకులు పాల్గొని పి.సుశీల పాడిన పాటలను ఆలపిస్తారని తెలిపారు. ఆ మేరకు ఆలిండియా కళారంగం ప్రకాశం జిల్లా గౌరవాధ్యక్షుడు మండవ మురళీకృష్ణ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. నిర్వాహకులను మురళీకృష్ణ అభినందించారు. చల్లా నాగేశ్వరమ్మ, పసుపులేటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ తెల్లప్రోలు గాంధీ, ఎస్.వెంకటలక్ష్మి, ఏల్చూరి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలు విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ


విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న మాధవరావు


చీమకుర్తి: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటుకు అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో బుధవారం భూమి పూజ నిర్వహించారు. చీమకుర్తిలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఘంటసాల విగ్రహం పక్కనే బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు గోపురపు రాజ్యలక్ష్మి చంద్ర, సోమా శేషాద్రి, నూరంపల్లి హనుమంతరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. దాతల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా వారు మాధవరావును అభినందించారు.

నేటి నుంచి హరిహరక్షేత్రంలో మాలధారులకు అన్నదానం

చీమకుర్తి: సర్వదీక్షా భక్తులకు గురువారం నుంచి చీమకుర్తి హరిహరక్షేత్రంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్ర కార్తీక మాసం సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, కుటుంబ సభ్యులు గురువారం ఆలయంలో పూజలు చేసి నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. మాలలు ధరించిన భక్తులకు వారి దీక్ష పూర్తయ్యేంత వరకు హరిహరక్షేత్రంలో అన్నదానం చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చలో చీరాల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీ చీరాలలో తలపెట్టిన చలో చీరాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. చలో చీరాల కార్యక్రమానికి స్థానికులను చైతన్యం చేయడంలో భాగంగా బుధవారం చీమకుర్తి వచ్చి స్థానిక మాల ఉద్యోగులు, మాల సంఘాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంగళరావు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ చీరాలలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి ఎక్కువ సంఖ్యలో మాల ఉద్యోగులు, మాల దళిత సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. సంఘ నాయకులు బండ్ల డేవిడ్, వేమా బాలకోటి, మట్టిగుంట రామాంజనేయులు, పిల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



- కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- అందుబాటులోకి రాని ప్రభుత్వ వెబ్‌సైట్
- కూటమి ప్రభుత్వ తీరుపై అసహనం

కొత్త పింఛన్లు లేనట్లేనా..!

ఐదు నెలలైనా తెరుచుకోని వెబ్‌సైట్...

ఎన్నికల నోటిఫికేషన్ సందర్భంగా నిలిచిపోయిన పింఛన్ల వెబ్‌సైట్.. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు కావస్తున్నా ఎందుకు తెరచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు సరైన సమాధానం లేకపోవడంతో సచివాలయ సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా వృద్ధులు కార్యాలయానికి వస్తే ఏం చెప్పాలనే ఆలోచనలో పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ఏదో ఒక సమాధానం చెప్పి పంపించేస్తున్నారు.

ఒంగోలు సిటీ:

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా.. ఇంత వరకు కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించడం లేదు. ప్రధాన ఎన్నికల హామీల్లో ఒకటైన పింఛన్ల హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండానే.. ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనపై ఇటీవల ప్రచారం చేసి కూటమి పార్టీల నేతలు అభాసుపాలయ్యారు. ఆ సమయంలో కొత్త పింఛన్లపై పలుచోట్ల ప్రజలు ప్రశ్నించడంతో కూటమి నేతలు మొహం చాటేయడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఒంగోలు నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 30,946 వేల మంది పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. గడిచిన ఐదు నెలలుగా వితంతువులు, వృద్ధాప్య, తదితర పింఛన్లకు అర్హత పొందిన వారు అధికంగానే ఉన్నారు. వారంతా పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పైగా, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు అందజేస్తామని చెప్పింది. దానిపై ఇంత వరకు ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో అర్హులైన పేదలంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు వెళ్తున్నారు. కానీ, నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో వారంతా నిరాశగా వెనుదిరిగివెళ్తున్నారు.

గత ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పింఛన్లు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులకు కొత్త పింఛన్ల కోసం గ్రామ వలంటీర్లే దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేసేవారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. ప్రస్తుతం అలాంటి వ్యవస్థ లేకపోవడంతో కొత్త పింఛన్లు ఉన్నట్టా..లేనట్టా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఏకంగా వెబ్‌సైట్‌నే నిలిపివేయడం, దరఖాస్తులు స్వీకరించకపోవడంతో అర్హులైన వారు నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సైతం పింఛన్లు మంజూరు చేయించాలంటూ అధికారులకు అర్జీలిస్తున్నారు.

ఉన్న పింఛన్లు తొలగించేందుకు కూటమి కుట్ర...

కొత్త పింఛన్ మాట దేవుడెరుగు..ప్రస్తుతం తీసుకుంటున్న పింఛన్లను తొలగించేందుకు కొందరు అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. నియమ నిబంధనలు అంటూ ఇప్పటికే కొందరి పింఛన్లు రద్దు చేసినట్లు సమాచారం. దీంతో టీడీపీ నాయకులు, కూటమి ప్రభుత్వ తీరును పేదలు తప్పుపడుతున్నారు. కొత్త పింఛన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే..ఉన్న పింఛన్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

మహిళల్లో అక్షరాస్యతపై చైతన్యం తీసుకురావాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు: గ్రామీణ ప్రాంతాల మహిళల్లో అక్షరాస్యతపై చైతన్యం తీసుకొస్తేనే ఆర్థిక నేరాలను అరికట్టవచ్చని ప్రకాశం జిల్లా వయోజన విద్య పర్యవేక్షకుడు టి.శ్రీనివాసరావు తెలిపారు. మహిళల్లో అక్షరాస్యత తీసుకురావాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, గ్రామ పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువు లేని మహిళల్లో అక్షరాస్యతపై చైతన్యం తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయన్నారు. ఇందుకోసం లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి ముందుకొచ్చే మహిళలు, యువతులను వలంటీర్లుగా ఏర్పాటు చేసి వారి ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే క్రమంలో డిజిటల్, ఆర్థిక, సాంకేతిక, క్రియాత్మక అక్షరాస్యత సాధించేలా ఉండాలన్నారు. దాని కోసం మ్యాచింగ్– బ్యాచింగ్ చేసి మండలంలోని 970 మందికి మెదటి విడతగా గుర్తించిన పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని జరపాలని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ దక్షణామూర్తి మాట్లాడుతూ ఇప్పటికే స్వయం సహాయక సంఘాలలో ఉన్న లబ్ధిదారులకు అక్షరాస్యత ఎప్పుడు వస్తుందో అప్పుడు సమాజం వికాసం చెందుతుందని తెలిపారు. ఎంఈవో రవి మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత వలన మహిళలు ఆర్థిక నేరాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. అక్షర వెలుగు వాచకంలో ఉన్న ఎనిమిది పాఠ్యాంశాల గురించి వివరిస్తూ ఎప్పుడైతే అక్షర వెలుగులు విరజిల్లుతాయో అప్పుడే అందరి జీవితాల్లో కాంతి వెలుగులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం నరేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, శివనాగరాజ, ఉషారాణి, ప్రమీల, సీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఓఏలు పాల్గొన్నారు.

శ్రీగిరిలో టీటీడీ డైరీలు, క్యాలెండర్ల విక్రయం


టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం గోశాలలో 2025 నూతన సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్ల విక్రయ కేంద్రాన్ని బుధవారం సాయంత్రం ప్రారంభించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, శ్రీగిరి దేవస్థానం అర్చకులు, వేద పండితులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు. టీటీడీ డైరీలు, క్యాలెండర్లు పరిమిత సంఖ్యలో వచ్చినందున భక్తులకు ఒక్కొక్కరికి ఒక్కొక్క డైరీ, క్యాలెండర్ మాత్రమే అందజేయనున్నట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ఠ వేడుకలు


శిలాన్యాస్‌కు గంగాజలాన్ని అందిస్తున్న మహిళా భక్తులు

చీమకుర్తి: చీమకుర్తి గరికమిట్టలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొదటి రోజు ధ్వజస్తంభానికి పూజలు, శిలాన్యాస వేడుకల సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానిక భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచన, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, జాలాధివాసంతో పాటు విశేష పూజలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు.


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు


పూజల్లో పాల్గొన్న ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

సంతనూతలపాడు: సంతనూతలపాడు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్య కేంద్ర కౌన్సిలర్లు రుద్రవరం గ్రామంలో బుధవారం జన సురక్ష క్యాంపు నిర్వహించారు. మైనంపాడు కెనరా బ్యాంక్ నోడల్ ఆఫీసర్ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ అకౌంట్ కలిగి ఉండాలని, నామినీ పెట్టుకుని ఉండాలని సూచించారు. అకౌంట్‌ను సరైన విధానంలో రన్నింగ్ చేస్తుంటే బ్యాంకు ద్వారా సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్, ప్రధాన మంత్రి ముద్ర యోజన, విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా ఎడ్యుకేషనల్ లోన్స్, గృహ రుణాలు, పర్సనల్ లోన్స్, ఇలా అనేక గవర్నమెంట్ స్కీమ్స్ ఉంటాయని వివరించారు. అనంతరం 40 మందికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ఇన్సూరెన్స్ చేయించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్య కేంద్ర కౌన్సిలర్లు ఆత్మకూరు చిన్న రాజా, అమృత రాజు, కెనరా బ్యాంక్ మైనంపాడు బ్రాంచ్ మేనేజర్ నాగేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల మనిషి.. మిడసల


మిడసలకు నివాళులర్పిస్తున్న రంగస్థల, సాహిత్య సంస్థల ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: సుదీర్ఘకాలం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన పేద ప్రజల పక్షపాతి, కమ్యూనిస్టు పార్టీ యోధుడు మిడసల వెంకటసుబ్బయ్య 22వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత వివిధ రంగస్థల, సాహిత్య సంస్థల ప్రతినిధులు మిడసల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆగమ వేద పండితులు పరాంకుశం కేశవాచార్యులు మాట్లాడుతూ రైతు ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడిన కమ్యూనిస్టు యోధుడు మిడసల అని కొనియాడారు. కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, అల్లూరు ఎంపీటీసీ మిట్నసల శాంతారావు, విశ్రాంత అధికారులు మెడబలిమి సాంబశివరావు, తహసీల్దారు పేరయ్య, అంగలకుర్తి ప్రసాద్, కొప్పోలు వెంకటేశ్వర్లు, అయినంపూడి నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

35 మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం


విద్యార్థులకు సభ్యత్వం అందజేస్తున్న దృశ్యం

ఒంగోలు సిటీ: ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా పిల్లల గ్రంథాలయంలో ఒంగోలులోని హెచ్‌సీఎం స్కూల్లో చదువుతున్న 35 మంది విద్యార్థులకు బుధవారం సభ్యత్వం అందించారు. విద్యార్థుల సభ్యత్వానికి పి.పేరయ్య ఆర్థికసాయం చేశారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

ఒంగోలు సిటీ: రైతులు పొగాకు సాగు తగ్గించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మినుము, పెసర, అపరాలైన సజ్జ, రాగి, జొన్న, తదితర పంటల సాగుపై ఆసక్తి చూపాలని ఏఓ కిషోర్‌బాబు సూచించారు. బుధవారం ఒంగోలు మండల పరిధిలోని యరజర్ల గ్రామంలో పాతపంచాయతీ వద్ద పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కిషోర్‌బాబు మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులకు జాతీయ ఆహార భద్రతా మిషన్ నుంచి విత్తనాలు, పురుగుమందులకు కొంత రాయితీ ఇచ్చి ఇతర పంటల సాగు వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణాధికారి కె.రామకృష్ణారెడ్డి, వీఏఏ కె.హైమావతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు, ఎండ్లూరు, గురువారెడ్డిపాలెం గ్రామాల్లో రైతులకు బుధవారం పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారి పి.పావని రైతులతో మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగా, కంది, మినుము, పెసర, అలసందలు, సజ్జ, జొన్న, మొక్కజొన్న, కొర్ర పంటలు సాగు చేయాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. పొగాకుకు మార్కెట్ ధరలు స్థిరంగా లేకపోవడం వలన రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. అనంతరం మండలంలోని గురవారెడ్డిపాలెం, ఎండ్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి కేవీ సుబ్బారెడ్డి, ఎండ్లూరు, మైనంపాడు, గురవారెడ్డిపాలెం గ్రామాల వ్యవసాయ సహాయకులు తన్నీరు చిరంజీవి, పోకూరి సాయిరాం, పలువురు రైతులు పాల్గొన్నారు.


కొత్తపట్నం: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ రమేష్


యరజర్లలో మాట్లాడుతున్న ఏఓ కిషోర్‌బాబు

అవసరమైతేనే రసాయనిక ఎరువులు వాడాలి...

కొత్తపట్నం: రసాయనిక ఎరువులను అవసరమైనంత వరకే వాడుకుని సేంద్రియ ఎరువుల వినియోగం పెంచుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.రమేష్ సూచించా. మోటుమాల, బీరంగుంట గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఏవో మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచుకోవడం వలన వరి పంటలో పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అజయ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు నవ్య, పశుసంవర్ధక సహాయకుడు వినయ్, మార్కెట్ శాఖ నుంచి కిషోర్, రైతులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ పరిశీలన


సిబ్బందికి సలహాలిస్తున్న ఎన్‌క్వాస్ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణప్రసాద్‌తో వైద్యశాఖ సిబ్బంది

మద్దిపాడు: మండలంలోని బసవన్నపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్వాస్) జిల్లా కో ఆర్డినేటర్ ఎన్.కృష్ణప్రసాద్ బుధవారం పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్‌లో ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌క్వాస్ టీమ్ సభ్యులు జిల్లాలో మొదటిసారిగా వర్చువల్ విధానంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు.

టీమ్ సభ్యులు సంతృప్తి చెందితే కేంద్రం నుంచి సర్టిఫికెట్ పంపించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట వైద్యశాఖ సూపర్‌వైజర్ బాలకోటయ్య, హెచ్‌వీ నాగరాజి, ఎంఎల్‌హెచ్‌పీలు జస్సీరోజ్‌పాల్, అఖిల, మాధురీలత, ఏఎన్‌ఎం మాధవి, సురేష్, ఆశావర్కర్లు పద్మ, శిరీష పాల్గొన్నారు.

ఇనమనమెళ్లూరులో ఫాగింగ్

మద్దిపాడు: సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ముందు జాగ్రత్త చర్యగా మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో బుధవారం ఫాగింగ్ చేపట్టినట్లు వైద్యశాఖ సూపర్‌వైజర్ బాలకోటయ్య తెలిపారు. దోమల బెడద ఎక్కువగా ఉండటంతో గ్రామ కార్యదర్శిని పలువురు గ్రామస్తులు దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరిన క్రమంలో ఫాగింగ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

9న ఇనమనమెళ్లూరులో మెడికల్ క్యాంప్

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరులో ఈ నెల 9వ తేదీ మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు సూపర్‌వైజర్ తెలిపారు. వైరల్ జ్వరాలు సోకుతున్న నేపథ్యంలో ఆస్పత్రి డాక్టర్లు, కిమ్స్ ఆస్పత్రి జనరల్ డాక్టర్ క్యాంపులో పాల్గొంటారని, గ్రామస్తులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి వేడుకలు

ఒంగోలు మెట్రో: కార్తీకమాసం నాగపంచమి సందర్భంగా బుధవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో తెల్లవారుజామున భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఒంగోలు నగరంలోని శైవక్షేత్రాలలో శివునికి ప్రాతఃకాలంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక లాయరుపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న మరకత శివలింగానికి, కేశవస్వామిపేటలోని కాశీవిశ్వనాథుని దేవాలయంలో, రంగారాయుడు చెరువు దగ్గర అరుణాచలేశ్వరస్వామికి, అంజయ్య రోడ్డులోని సాయిశివ పంచముఖ క్షేత్రంలో, కొత్తపట్నం బస్టాండ్ శివాలయంలో, మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లో హరిహరసుత అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి, బాలాజీరావుపేటలోని దుర్గామల్లేశ్వరస్వామికి, గాంధీనగర్లో రామలింగేశ్వరస్వామికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి, సమతానగర్లోని సాగర్ కాల్వ దగ్గర దుర్గామల్లేశ్వరస్వామికి ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. శివునికి ప్రీతికరమైన బిల్వ దళాలతో శివ అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. హారతులతో భక్తులకు స్వామివారి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ప్రత్యేక అలంకరణలో నాగేంద్రస్వామి

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

కొత్తపట్నం: భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. స్థానిక నల్లూరు గార్డెన్‌లో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా, ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రైతుల అర్జీలు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుకు 185 అర్జీలు వచ్చాయి. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ మధుసూదన్‌రావు, సీఐ మేడా శ్రీనివాసరావు, ఆర్ఐ వరప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

34 మద్యం బాటిళ్లు పట్టివేత


సీజ్ చేసిన మద్యంతో ఎస్సై రవీంద్రారెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్లలో బెల్ట్‌షాపు నిర్వాహకుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన 34 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బెల్ట్‌షాపులు నిర్వహించినా, నాటుసారా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.